క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: మండలానికి మొదటి విడతలో మంజూరైన 30 గోకుల షెడ్ల యూనిట్లకు దరఖాస్తులు చేసుకోవాలని పశుగణాభివృద్ధిశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం గురువారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో గల వెటర్నరీ అసిస్టెంట్లకు అందజేయాలన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్థలానికి సంబంధించినఅండర్ టేకింగ్ సర్టిఫికెట్, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్ ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. గ్రామసభ తీర్మానం, వాంగ్మూలం, యానిమల్ పోజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న షాలినీ మీనన్

పొందూరు: మండల కేంద్రంలోని డాక్టర్ సనపల తిరుపతిరావు కాంప్లెక్స్‌లో యూనియన్ బ్యాంకు నూతన శాఖను విశాఖపట్నం జోనల్ హెడ్ షాలినీ మీనన్ గురువారం ప్రారంభించారు. బ్యాంకు సేవలను విస్తరిస్తున్నామన్నారు. మెరుగైన సేవలను అందిస్తామన్నారు. వాండ్రంగి సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు బూరాడ వెంకటరమణ, కె.సాయికుమార్, నాయకులు బాడాన గిరిబాబు, జేఈఆర్, బ్యాంకు అధికారులు, ఏపీఎం శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మెటీరియల్ పంపిణీ



టెట్, డీఎస్సీ మెటిరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: నిరుద్యోగ అభ్యర్థులు పోటీతత్వం అవరుచుకోవాలని సైకాలజిస్ట్ జి.రాజేశ్వరరావు అన్నారు. స్థానిక సరాలి కూడలి వద్ద ఉన్న కొరికాన కాంపిటేటీవ్ అకాడమీలో టెట్, డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులకు ఉచితంగా టెట్, డీఎస్సీ మెటిరియల్‌ను ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేశ్వరరావు, కొరికాన సురేష్, డాక్టర్ లుకలాపు సంతోష్ చక్రవర్తి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు తమ వంతు చేయూత అందజేస్తామన్నారు. కాంపిటేటీవ్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, నక్క క్రాంతి, టి.నవీన్, ఎం.రామకృష్ణ, రామ్ శంకర్, వికాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదు



వాబ యోగేశ్వరరావు

సారవకోట: జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో బెంతు ఒరియా తెగకుల ధ్రువీకరణ పత్రాలతో చాలా మంది ఉద్యోగం చేస్తున్నారని, అటువంటి వారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను సంపాదించి ఉద్యోగాలు చేస్తున్న వారికిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చిన హామీ అయిన మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయడం అనే హామీ నిలబెట్టుకోవాలని కోరారు.

జంగిల్ క్లియరెన్స్



పారాపురం వద్ద జంగిల్స్‌ను తొలగిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని పారాపురంతో వద్ద ఏబీ రోడ్డుతోపాటు పలు ప్రధాన రహదారుల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న జంగిల్‌ను స్థానిక ఎస్‌ఐ ఎం.ఎ.అహ్మద్ ఆధ్వర్యంలో జేసీబీతో గురువారం తొలగించారు. రోడ్డు మలుపుల వద్ద దట్టంగా ఉన్న ముళ్ల పొదలను తీసివేయాలన్న ఎస్పీ ఆదేశాల మేరకు తొలగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: దోమల నివారణ పట్ల ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని మలేరియా నిర్మూలన సబ్ యూనిట్ అధికారి అచారి అన్నారు. మండల కేంద్రంలో గురువారం దోమల నిర్మూలన కోసం ఇళ్లల్లో ఫ్యాగింగ్ చేయించారు. దోమల కాటు బారిన పడితే మలేరియా, డెంగీ, వైరల్ వంటి జ్వరాలు వ్యాపిస్తున్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటితో పాటు పరిసరాల్లో చెత్త, మురుగునీరు, వర్షంనీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ బి.జనార్దనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఔదార్యం



జిల్లాకు చెందిన 2018 ఎస్టీటీ బ్యాచ్ ఉపాధ్యాయులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పాతపట్నం ఆర్టీసీ కాంపెక్స్ సమీపంలో ఉన్న లవ్లీ చిల్డ్రన్ హౌస్ అనాథ ఆశ్రమానికి గురువారం తమవంతు సాయం అందించినట్లు ఉపాధ్యాయులు జి.ఉమామహేశ్వరరావు, బి.కోటేశ్వరరావు తెలిపారు. నిత్యావసర సరుకులు, 5 బస్తాల బియ్యం ప్యాకెట్లు అందజేశామన్నారు. లక్ష్మణరావు, అప్రజ్, సంతోష్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

– పాతపట్నం

● నేత్ర పరీక్షలు



హిరమండలం మండలంలోని చొర్లంగి పీహెచ్‌సీ పరిధిలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్‌ఎం బి.గొల్లవాడు ఆధ్వర్యంలో కొత్తూరు నేత్ర వైద్య నిపుణలు ఇప్పిలి జానకిరామయ్య 187 మందికి కంటి పరీక్షలు చేశారు. 11 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. జిల్లా అంధత్వనివారణ సంస్థ ద్వారా చితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు జానకిరామయ్య తెలిపారు. సాధారణ కంటి సమస్యలున్న 45 మందికి మందులు పంపిణీ చేశారు. ఫోన్ ఎక్కువగా చూడవద్దని సూచించారు. విటమిన్-ఏ ఉండే పదార్థాలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– హిరమండలం

● అన్నదానం



మెళియాపుట్టి మండల కేంద్రంలోని ఎగువ వీధిలో గురువారం మహాఅన్నదానం నిర్వహించారు. వినాయక పూజా మహోత్సవాలను పురస్కరించుకుని 21 రోజులపాటు ఉత్సావాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వారపు సంత జరుగుతున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అనపాన రాజశేఖర్‌రెడ్డి, బస్వ భాస్కరరావు, పరమేష్, శరత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

– మెళియాపుట్టి

అధికమైతే అనర్థమే

- పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అధిక వాడకం వల్ల భూసారం క్షీణించే అవకాశం
- విషతుల్య మందులతో ప్రాణాలకు ప్రమాదం



నరసన్నపేట: దేవాది వద్ద పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నరసన్నపేట/హిరమండలం/సరుబుజ్జిలి: సీజన్‌కు అనుగుణంగా పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకుతుంటాయి. ఒకటి, రెండు పురుగులు కనిపించగానే రైతులు పైరుపై వివిధ రకాల పురుగు మందుల పిచికారీ చేసేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలుచేసే మిత్రపురుగులు సైతం చనిపోతున్నాయి. భూసారం దెబ్బతిని పంట దిగుబడికూడా తగ్గుతుంది. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పురుగు మందులు పిచికారీ చేస్తున్న సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముక్కు, ముఖానికి తాకరాదు.
- భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- మందులు పిచికారీ చేసిన తర్వాత ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతుక్కోవాలి
- విష ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- ఎటువంటి పరిస్థితుల్లోనూ నాటు వైద్యుడు, ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించుకోవడం ప్రమాదకరం.
- పిచికారీ సమయంలో శరీరం కనిపించకుండా దుస్తులు ధరించాలి.
- పురుగు మందులు కలిపిన ద్రావణం, డబ్బా, సీసీలను కాలువలు, చెరువుల్లో వేయరాదు. అందులో నీటిని వేసి తాగరాదు. వాడిన పురుగు మందు డబ్బాలను రంధ్రం చేసి దూరంగా ఉంచాలి.
- క్రిమి సంహారిక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.
- గాలివీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయరాదు.
- సరైన మోతాదులో క్రిమి సంహారిక మందులను వాడాలి. డోస్ ఎక్కువైతే పంటకు ఉపయోగపడే జీవులు కూడా మృత్యువాత పడే అవకాశం ఉంటుంది.

మోతాదు మేరకే వినియోగించాలి



క్రిమి సంహారిక మందుల పిచికారీ, రసాయనిక ఎరువుల వినియోగ సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా మోతాదుకు మించరాదు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు విధిగా పాటించాలి. మందుల వాడకంలో రైతు సేవా కేంద్రాల్లో గోడలకు అతికించిన పోస్టర్లను పరిశీలించడం మంచిది.

– రవీంద్రభారతి, ఏడీ, నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గంలో సాగుభూమి (ఎకరాల్లో) వివరాలు	
మండలం	సాగుభూమి
నరసన్నపేట	18,620
పోలాకి	19,630
జలుమూరు	20,670
సారవకోట	16,310
పాతపట్నం నియోజకవర్గంలో సాగుభూమి (ఎకరాల్లో) వివరాలు	
మండలం	సాగుభూమి
పాతపట్నం	16,953
హిరమండలం	7,101
కొత్తూరు	13,244
మెళియాపుట్టి	14,020
ఎల్.ఎన్.పేట	9,659
ఆమదాలవలస నియోజకవర్గంలో సాగుభూమి (హెక్టార్లలో) వివరాలు	
మండలం	సాగుభూమి
ఆమదాలవలస	5,800
సరుబుజ్జిలి	5,200
బూర్జ	4,600
పొందూరు	6,200

జగనన్నను కలిసిన నాయకులు





విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగనన్నను కలిశారు. నియోజకవర్గాల్లోని పార్టీ పరిస్థితిని తెలియజేశారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

– ఎల్.ఎన్.పేట/నరసన్నపేట

కనిమెట్ట సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు



ఉదయం 10.30 గంటల సమయంలో హాజరైన సచివాలయం సిబ్బంది



ఉదయం 11:30 గంటల తర్వాత హాజరైన సిబ్బంది

పొందూరు: మండలంలోని కనిమెట్ట గ్రామ సచివాలయానికి గురువారం ఉదయం 10:30 నుంచి 11.30 గంటల వరకు సిబ్బంది హాజరుకాకపోవడంపై అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 10.30 గంటలకు వీఆర్‌ఏతోపాటు మరో ఇద్దరు సిబ్బంది హాజరయ్యారు. 11 గంటల తర్వాత వీఆర్వో, టెక్నికల్ అసిస్టెంట్లు వచ్చారని గ్రామస్తులు తెలిపారు. సచివాలయం కార్యదర్శి రాజీవ్ గోకర్నపల్లి ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో గోకర్నపల్లి వెళ్లారు.కార్యాలయానికి ఎవరు హాజరయ్యారనేది తనకు సమాచారం లేదని రాజీవ్ తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీఓ హరిహరరావు వద్ద ప్రస్తావించగా.. విచారణ చేపట్టి సిబ్బందికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం



సబ్‌ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తూరు: తమ సమస్యను సబ్ ట్రెజరీ అధికారి వారం రోజుల్లో పరిష్కరించకపోతే ఆయన కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను గురువారం తెలిపారు. కొత్తూరు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు దాచుకున్న పొదుపు మొత్తంలో పార్షియల్ విత్ డ్రా కోసం గత నెల 27 తేదీన దరఖాస్తు చేసుకున్నారన్నారు. 20 రోజులు కావస్తున్నా పార్షియల్ విత్ డ్రాపై ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. దరఖాస్తులు పరిశీలించి విత్ డ్రాకు అనుమతులు ఇవ్వకపోతే యూటీఎఫ్ తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అంతక ముందు సబ్ ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శోభన్‌బాబు, విజయకుమార్, సభ్యులు వీరభద్రరావు, దినేష్, కృష్ణరావు, బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

నరసన్నపేట: మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. బుధవారం బాలురుకు, గురువారం బాలికలకు ఆటల పోటీలను ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాలను ఎంపిక చేశారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈఓ దాలినాయుడు, శాంతరావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, హెచ్‌ఎం హర్షవర్ధన్ శర్మ, ఆటల పోటీల కన్వీనర్ లక్ష్మణరావు అభినందించారు.

కుంకుమార్చనలు



కుంకుపూజల్లో పాల్గొన్న భక్తులు

సారవకోట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం దగ్గర గురువారం భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సారవకోట విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. చీడిపూడి, బొంతు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు.

రూ.5 లక్షల విరాళం అందజేత

పాతపట్నం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శ్రీరామ్ రమణ, బామిడి రాజు, పడ్డ లోకేష్, గుంపు భాస్కరరావు, రెంటికోట మాధవరావు ఒక్కో లక్ష చొప్పున విరాళం అందజేశారు. రూ.5 లక్షల చెక్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ఉండవల్లిలో విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు గురువారం అందించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



సారవకోట: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

సారవకోట: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక వికాశం కలుగుతుందని ఎంఈఓలు రమణ, భూలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రిగ్స్, ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభించారు. మండల స్థాయిలో ఉన్న నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, సవరబొంతు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రింగ్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని, దీంట్లో ప్రతిభ కనబర్చిన వారికి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

హిరమండలం: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ తూలుగు మేనక, పాగిరి బుచ్చిబాబు అన్నారు. మండలంలోని కార్మిల్ ప్రైవేట్ పాఠశాల మైదానంలో ఎంఈఓ కె.రాంబాబు ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు. 200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎంఈఓ తెలిపారు. కల్లట సర్పంచ్ ఎల్.లీలావతి, హెచ్‌ఎం టి.కేశవరావు, కార్మిల్ స్కూల్ డైరెక్టర్ రంజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ వాన గోపి అన్నారు. గురువారం కరవంజ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాలిబాల్, కబడ్డీ, ఖోఖోలో అండర్-14, అండర్-17 విభాగంలో గెలిపొందిన క్రీడాకారులను అభినందించారు. ప్రిన్సిపాల్ డి.గణేషట్నాయక్, గుంట లక్ష్మీనారాయణ, సర్పంచ్ జుత్తు నేతాజీ, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ భుజంగరావు పాల్గొన్నారు.

పొలం గట్లపై సాగుతో లాభదాయకం



కొత్తూరు: గొట్టిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సిబ్బంది

కొత్తూరు: వరి పొలం గట్లపై కంది, బంతి, కూరగాయలు, అరటి, కొబ్బరి వంటి పంటలు సాగు చేయడం వల్ల రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ కొత్తూరు సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గిరిజన గ్రామంలో గురువారం ఏడో వారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జీల్లేడు ద్రావణం తయారుచేయు విధానాన్ని వివరించారు. రైతులు, ఎఫ్‌పీఓ నాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

హిరమడలం: యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరమని ఎంఈఓ బి.సంధ్య అన్నారు. మండలంలోని కిట్టలపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పొలంబడి కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. 14 వారాల పాటు శాస్త్రీయ, సాంకేతిక సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతందన్నారు. ఏడో వారం పొలంబడి నిర్వహించడం జరుగుతుందన్నారు. పంటపొలాల గట్లుపై వేసిన బంతి, కంది మెక్కలు చిగురు భాగంలో తృంచడం (చీల్చడం)పై అవగాహన కల్పించారు. పొలం పరిసరాల విశ్లేషణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు రైల్వే గేటు మూసివేత

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ పరిధి ఆమదాలవలస-నరసన్నపేట రోడ్డులో ఊసవానిపేట వద్ద గల రైల్వే గేటు మరమ్మతు పనులు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజులపాటు గేటు మూసివేసి ఉంచుతున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని స్థానికులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధి పొన్నాడ ఫీడర్‌లో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు బొంతలకోడూరు, పొన్నాడ, కమ్మపేట పరిధిలో విద్యుత్ కోత అమలవుతుందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్‌ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ సూచించారు. పురపాలక సంఘ పరిధిలోని ఐదో వార్డు పరిధి అక్కివలసలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.

ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పొందూరు: పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లిలో గురువారం జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన సాహితీ కార్యక్రమంలో పొందూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రాజారావును పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్ సత్కారం చేశారు.

మనబడి-మనతోట పుస్తకావిష్కరణ సందర్భంగా పుస్తక రచనలో భాగస్వాములైన రాజారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పగడాలమ్మ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం రూ.25,200

పొందూరు: స్థానిక కనకల వీధిలోఏఇ వినాయక మండలం వద్ద లడ్డూ ప్రసాదానికి గురవారం వేలం పాట నిర్వహించారు. పొందూరుకు చెందిన నల్లా శంకరరావు రూ.25,200 ధరకు లడ్డూను దక్కించుకున్నారు.

ఈ వేలంపాటలో ఎ.భవానీశంకర్, అనకాపల్లి గోపీనాథ్, ఎ.శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



విరాళాలు సేకరిస్తున్న భవిత పాఠశాల చిన్నారులు

ఆమదాలవలస: విజయవాడ వరద బాధితలకు సాయం అందించేందుకు పట్టణంలోని భవిత స్కూల్ చిన్నారులు పెద్ద మనసుతో రూ.30 వేలు విరాళాలు సేకరించారు. పాఠశాలలోని ప్రతీ చిన్నారి తమవంతు సాయం అందించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత గురువారం వెల్లడించారు. జి.భాగ్యశ్రీ, ఆర్.పవిత్ర, మెట్ట నేహ, జె.కావ్యశ్రీ బృందంగా ఏర్పడి వారి గ్రామాల్లో విరాళాలు సేకరించి అందరి మన్ననలు పొందారు. ఎన్ఆర్ఐ(అమెరికా) సువ్వారి శ్రీనివాసరావు, జ్యోతిలక్ష్మి దంపతులు 101 డాలర్ల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.